

చావునీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే బలాల

కలుషిత నీటి సరఫరా నివారణకు చర్యలు : బలాల

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): చావునీ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లోని ఇళ్లకు నల్లా ద్వారా జలమండలి సరఫరా చేసే తాగునీరు కలుషితమవుతుండడంతో అధికారులతో కలిసి మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. చావునీలోని మదీనా మజీద్ లేన్, ఖాజానే కీ బౌలీ లేన్‌లోని ఇళ్లకు కలుషిత నీరు సరఫరా అవుతుందని స్థానికులతో కలిసి డివిజన్ కార్పొరేటర్ షాహిద్ మూన్ ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఆయన జలమండలి చంచల్‌గూడ సెక్షన్ మేనేజర్ నవీన్‌తో కలిసి తనిఖీలు నిర్వహించి కలుషితం కావడానికి కారణమైన సీవరేజీ పైప్‌లైన్ లీకేజీని గుర్తించారు. తక్షణమే నివారణకు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. అదేవిధంగా చంచల్‌గూడ న్యూ రోడ్‌లో రూ.20లక్షలతో చేపట్టనున్న సీవరేజీ, తాగునీటి పైప్ లైన్ నిర్మాణంతో పాటు సీసీ రోడ్డు నిర్మాణ పనులను రంజాన్ మాసం ప్రారంభానికి ముందే పూర్తి చేయాలని ఆయన జీహెచ్ఎంసీ ఏఈ మల్లికార్జున్, వర్క్ ఇన్‌స్పెక్టర్ అహ్మద్‌కు సూచించారు.

సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలి

సరూర్‌నగర్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఆస్పత్రి ఖర్చులకు ఆసరాగా నిలిచే సీఎం సహాయనిధి పథకాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని బడంగ్‌పేట్ కార్పొరేషన్ మాజీ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి సూచించారు. బాలాపూర్‌కు చెందిన జెట్టి భిక్షపతి ఇటీవల అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరి వైద్యం చేయించుకోగా పెద్ద మొత్తంలో ఖర్చయింది. దాంతో ఆయన మాజీ మేయర్ ద్వారా సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా రూ.60వేలు మంజూరయింది. దీనికి సంబంధించిన చెక్కును శుక్రవారం భిక్షపతికి పారిజాతా రెడ్డి అందజేశారు. పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన వారు సీఎంఆర్ఎఫ్ పథకంతో ఆర్థిక ఆసరా పొందాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు.

ఆర్టీసీ కార్మికులకు శిక్షణ తరగతులు

హయత్‌నగర్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశం మేరకు శుక్రవారం హయత్‌నగర్ డిపోలో సిబ్బందికి పవర్ శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్ రీజినల్ మేనేజర్ సుచరిత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బందిలో దాగి ఉన్న నైపుణ్యాన్ని మెరుగుపరచడానికి శిక్షణ తరగతులను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం

చంపాపేట, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్‌లోని కర్మన్‌ఘాట్ క్రాంతి యువజన సంఘం, దుర్గానగర్‌కాలనీ, క్రాంతినగర్ కాలనీల్లో ఓపెన్‌జిమ్స్, ఐమాస్ట్‌లైట్లను శుక్రవారం కార్పొరేటర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఆయా కాలనీలలో జీహెచ్ఎంసీ నిధులు రూ.9.50లక్షలతో ఓపెన్‌జిమ్‌లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో క్రాంతి యువజన సంఘం అధ్యక్షుడు వంగా వెంకట్‌రెడ్డి, ఆయా కాలనీల ప్రతినిధులు ఆనంద్, యాదగిరిరెడ్డి, సుంకరి రమేష్ గౌడ్, చీర తిరుమలేష్, బాబుగౌడ్, చీర సత్యనారాయణ, పాలెం శేఖర్‌గౌడ్, సత్తిరెడ్డి, చేగోని శ్రీనివాస్‌గౌడ్, ఎరుకల విశ్వనాథ్‌గౌడ్, జగన్నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీ మెంబర్‌గా సుజాతానాయక్

చంపాపేట, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్‌గా కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు, హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు శుక్రవారం జీహెచ్ఎంసీ కమిషనర్ ప్రకటించారు. సుజాతానాయక్ స్టాండింగ్ కమిటీ మెంబర్‌గా ఎన్నిక కావడం పట్ల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. పలువురు నేతలు కార్పొరేటర్‌కు అభినందనలు తెలిపారు.

కొత్తపేట డివిజన్‌కు నిధులు మంజూరు చేయాలి

కొత్తపేట, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్‌లో సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తికి కార్పొరేటర్ పవన్‌కుమార్ విన్నవించారు. శుక్రవారం ఆయన కమిషనర్‌ను కలిసి సమస్యలను వివరించారు. సమతాపురి, న్యూనాగోల్, నాగేశ్వర్‌నగర్ తదితర కాలనీల్లో ఆగిపోయిన బాక్స్‌డ్రెయిన్ పనులను పునరుద్ధరించాలన్నారు. కాలనీల్లో కమ్యూనిటీ హాళ్లలో ఫ్లోరింగ్ మరమ్మతు పనులు, వాష్‌రూమ్స్ తదితర సదుపాయాల కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు.

ఆస్తిపన్ను చెల్లించిన రైతు సహకార సంఘం



ఆస్తిపన్ను చెక్కును మున్సిపల్ అధికారులకు అందిస్తున్న చైర్మన్ సత్తయ్య

హయత్‌నగర్ : తుర్కయంజాల్ మున్సిపాలిటీ కి చెందిన పది ఆస్తులకు సంబంధించిన ఆస్తిపన్ను రూ.8,66,604 చెక్కును శుక్రవారం సహకార సంఘం చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య మున్సిపల్ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సహకార సంఘం ఆస్తిపన్నును చెల్లించడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం సెక్రటరీ రాందాసుగౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రానున్న రోజుల్లో టీడీపీ కీలకంగా మారనుంది

దిల్‌సుఖ్‌నగర్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రానున్న రోజుల్లో తెలంగాణలో కీలకపాత్ర పోషిస్తుందని టీటీడీపీ మల్కాజిగిరి పార్లమెంటరీ కమిటీ సభ్యుడు యలమంచిలి వెంకటగాంధీ అన్నారు. టీడీపీ సభ్యత్వ నమోదులో భాగంగా అత్యధిక సంఖ్యలో సభ్యత్వాలు నమోదు చేపించిన వెంకటగాంధీని పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు, అరవింద్‌కుమార్‌గౌడ్‌లు జ్ఞాపికను అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా వెంకటగాంధీ మాట్లాడుతూ పార్టీ సభ్యత్వ నమోదుకు సహకరించిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

జీఎస్ఐ ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యవర్గం

మన్సూరాబాద్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): నాగోల్ డివిజన్ బండ్లగూడలోని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఎంప్లాయీస్ అసోసియేషన్ 25వ ప్రాంతీయ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇందులో భాగంగా అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా కె.అనిల్‌కుమార్, వైస్ చైర్మన్లుగా బి.శ్రీనివాసరావు, ఎం.రవీందర్, ప్రధాన కార్యదర్శిగా జె.సాయిబాబా, సహాయ ప్రధాన కార్యదర్శిగా టి.నితీష్‌సింగ్, ఆర్థిక కార్యదర్శిగా ఎ.మాధవరావు, ప్రాంతీయ కార్యనిర్వాహక మండలి సభ్యులుగా ఎస్.జగదీష్, తులసీబాయి, భవానీ, కె.సతీష్‌కుమార్, అక్బర్‌ఖాన్, శంకర్‌సింగ్, అమీర్‌ఖాన్‌లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సంస్థ అడిషనల్ డైరెక్టర్ జనరల్, హెటడీ సూరజ్ దోమజీ పట్కాజే నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు.

ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో అధికారుల తనిఖీలు



ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో తనిఖీలు చేస్తున్న ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ శృతి

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట ఆజంపుర ప్రాంతాల్లోని హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో జీహెచ్ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 ఫుడ్ సేఫ్టీ అధికారులు శుక్రవారం సాయంత్రం తనిఖీలు నిర్వహించారు. ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ శృతి ఆలేటితో కూడిన బృందం తనిఖీలు నిర్వహించారు. ఆహార పదార్థాల తయారీలో వాడుతున్న వస్తువుల నాణ్యతా ప్రమాణాలను ఆమె పరిశీలించారు. ముఖ్యంగా శాఖాహారం, మాంసాహారం వంటకాలను ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ శృతి స్వయంగా పరిశీలించారు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో, హోటల్‌లో నిల్వ ఉంచిన చికెన్, మాంసాహారం నుంచి ఏమైనా దుర్వాసన వెలువడుతుందా నిల్వ ఉంచిన చికెన్, మటన్ ఎన్ని రోజుల నుంచి నిల్వ ఉంచారు, ఫ్రిడ్జిల్లో నిల్వ ఉన్న ఆహార పదార్థాలన్నింటిని పరిశీలించారు. ఇక తయారీ కోసం మసాలాలు స్వయంగా తయారు చేసినవా లేక షాపుల్లో తక్కువ ధరకు నాణ్యతలేని అల్లం, వెల్లుల్లి పేస్ట్, వంట నూనె, ఇతర సాస్‌లతో కూడిన ద్రవ పదార్థాలను కూడా పరిశీలించారు.

వంట మనుషులు ముందస్తు జాగ్రత్త చర్యలు పాటించరా..

ఆజంపురలోని అనేక చోట్ల ఉన్న ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, హోటళ్లు, టిఫిన్ సెంటర్లలో వంట చేసే వారందరు సరైన ముందస్తు జాగ్రత్త చర్యలు పాటించడం లేదని మలక్‌పేట సర్కిల్-6 ఫుడ్ సేఫ్టీ అధికారుల బృందం గుర్తించింది. వంటచేసే మాస్టర్ చెఫ్‌లు, సహాయకులు చేతులకు గ్లౌజులు, వంటిపై అప్రాన్, తలకు పాగా దరించడం లేదని గుర్తించారు. ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధనలకు విరద్ధంగా హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో ఆహార పదార్థాలు తయారు చేస్తున్నట్లుగా గుర్తించారు. ఈ మేరకు పలు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల, హోటళ్ల నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. వంట చేసే వ్యక్తులకు, కిచెన్‌లో పనిచేసే సహాయకులకు మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు లేవని, కిచెన్‌లో, కస్టమర్లు భోజనాలు చేసే హాల్‌లో పెస్ట్ కంట్రోల్‌తో స్ప్రే చేయించిన దాఖలాలు లేవని, ఇలా చేయని కారణంగా బొద్దింకలు ఇతర పురుగులు కిచెన్‌లో ఉండే ప్రమాదముందని గుర్తించారు. కొన్ని చోట్ల కిచెన్‌లో దుర్వాసనతోపాటు అపరిశుభ్రంగా ఉన్నట్లు గుర్తించి ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను సీజ్ చేస్తామని హెచ్చరికలు జారీ చేశారు. కిటికీలకు తెరలు ఏర్పాటు చేయని కారణంగా గాలికి బయటి నుంచి దుమ్ము, ధూళి వస్తున్నట్లు అధికారుల బృందం గుర్తించింది. రోజుల తరబడి నిల్వ ఉంచిన పాచిపోయిన చికెన్, మటన్, కూరగాయలను ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, హోటళ్లలో ఉన్నట్లుగా గుర్తించి వాటి శాంపిల్స్‌ను సేకరించారు. అప్పటికప్పుడు వాటిని తొలగించేలా చర్యలు చేపట్టారు.

సమాచారం ఇచ్చేందుకు నిరాకరణ

ఆరోగ్యకరమైన ఆహారం సరఫరా చేయాల్సిన హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లపై జీహెచ్ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 ఫుడ్ సేఫ్టీ అధికారుల బృందం తనిఖీలు చేస్తున్నట్లుగా అందిన సమాచారం మేరకు మీడియా ప్రతినిధులు వెళ్తే సమాచారం ఇచ్చేందుకు నిరాకరించారు. ఇదంతా తాము రొటీన్‌గా చేసే తనిఖీలని చెప్పి ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ శృతి తప్పించుకున్నారు. పాచిపోయిన చికెన్, మటన్, కూరగాయలను సీజ్ చేసిన సమాచారాన్ని ఇచ్చేందుకు నిరాకరించారు. ఇక ఎన్ని హోటళ్లకు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లకు నోటీసులు ఇచ్చారనే సమాచారం ఇచ్చేందుకు కూడా ఆమె నిరాకరించారు.

సీలింగ్ భూమి రైతులకు పట్టా పాస్‌బుక్‌లు ఇవ్వాలి

● పంచాయతీ కార్యాలయం ఎదుట సీలింగ్ భూనిర్వాసితుల నిరసన



నిరసన కార్యక్రమంలో సీపీఎం ప్రధాన కార్యదర్శి యాదయ్య, సీలింగ్ భూనిర్వాసితులు

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సీలింగ్ భూమి రైతుల వివరాలు 1బీ ఆన్‌లైన్‌లో నమోదు చేసి పట్టా పాస్‌బుక్‌లను ఇవ్వాలని సీపీఎం రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పగడాల యాదయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో అబ్దుల్లాపూర్‌మెట్ మండలం అనాజ్‌పూర్ గ్రామంలో సీలింగ్ భూనిర్వాసితుల సంఘం చేపట్టిన నిరసన కార్యక్రమానికి యాదయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నంబర్ 274, 75, 76, 77, 78, 281లో 1991 సంవత్సరంలో 125 మంది రైతులకు ఒక్కొక్కరికి ఎకరా చొప్పున అప్పటి ప్రభుత్వం సీలింగ్ పట్టాలను పంపిణీ చేసిందని తెలిపారు. పట్టాలతో పాటు పాస్‌బుక్‌లను కూడా ఇచ్చిందన్నారు. అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీలింగ్ రైతుల వివరాలను ఆన్‌లైన్ నుంచి తొలగించి పట్టా పాస్‌బుక్‌లను రద్దు చేసిందని వెల్లడించారు. పదేళ్లుగా బాధిత రైతులకు రైతుబంధు, రైతుబీమా పథకాలు వర్తింపచేయలేదని తెలిపారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. ఈ విషయంపై పలుమార్లు రెవెన్యూ, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీలింగ్ భూ బాధిత రైతులకు వెంటనే పట్టా పాస్‌బుక్‌లను పంపిణీ చేయాలన్నారు. పార్టీ మండల కార్యదర్శి ఏర్పుల నర్సింహ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సామేల్, సీహెచ్ జంగయ్య, వెంకటేశ్, రాములు, గుండె శివకుమార్, ఆలేటి ఆటం, ముత్యాలు, బాల్‌రాజ్, భిక్షపతి, మహేందర్, మహేష్, రవి, కృష్ణ, శ్రీనివాస్, రాములు, మల్లేష్, జంగయ్య, యాదయ్య పాల్గొన్నారు.

విద్యుత్ బకాయిలు చెల్లించాలి : ఎస్ఈ

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): విద్యుత్ బకాయిదారులు బకాయిలు చెల్లించాలని టీఎస్ఎస్‌పీడీసీఎల్ సరూర్‌నగర్ ఎస్ఈ మాధవరెడ్డి బకాయిదారులను కోరారు. విద్యుత్ మొండి బకాయిల వసూళ్లలో భాగంగా శుక్రవారం సరూర్‌నగర్ సర్కిల్ పెద్దఅంబర్‌పేట సెక్షన్ పరిధిలోని గౌరెల్లి గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బకాయిదారులు తమ బకాయిలను చెల్లించి విద్యుత్ సర్వీసును పునరుద్ధరించుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈ కేకే రామకృష్ణ, ఏడీఈ విజయభాస్కర్, సీనియర్ అకౌంట్స్ అధికారి రమణారెడ్డి, అకౌంట్స్ అధికారి శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

సుధీర్‌కుమార్ సేవలు చిరస్మరణీయం : కోట్ల శ్రీనివాస్



సుధీర్‌కుమార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కోట్ల శ్రీనివాస్ పటేల్, సంఘం అధ్యక్షుడు అనంతుల నవీన్‌పటేల్, తోట రాజు పటేల్

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే పి.సుధీర్‌కుమార్ జయంతిని పురస్కరించుకుని మున్నూరుకాపు సంక్షేమ సంఘం ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం పీ అండ్ టీ కాలనీ చౌరస్తాలోని ఆయన విగ్రహానికి హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ పటేల్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, మలక్‌పేట ఎమ్మెల్యేగా సుధీర్‌కుమార్ అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం, మలక్‌పేట ప్రజలకు నిరంతరం శ్రమించిన నాయకునిగా ప్రత్యేక గుర్తింపు పొందారన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు అనంతుల నవీన్‌పటేల్, గౌరవ అధ్యక్షుడు తోట రాజు పటేల్, ప్రతినిధులు పులిపాటి త్రివేది పటేల్, ఎక్క రమేష్ పటేల్, పుట్టం విజయేందర్ పటేల్, ఆకుల ప్రవీణ్ పటేల్, మేకల అంజయ్య పటేల్, మంత్రి రాజు పటేల్, దండబోయిన విజయలక్ష్మి, చందర్, బండారు సురేష్ పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

అబ్దుల్లాపూర్‌మెట్ : బైక్ అదుపుతప్పడంతో కిందపడిన వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. హయత్‌నగర్ భగత్‌సింగ్‌కాలనీకి చెందిన సద్గుణ శేఖర్(26) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం బైకుపై ఇబ్రహీంపట్నం మండలంలోని పోల్కంపల్లి గ్రామానికి వెళ్లాడు. పని ముగించుకుని సాయంత్రం తిరిగి హయత్‌నగర్‌కు వస్తున్నాడు. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సంఘీనగర్ వద్దకు రాగానే బైక్ అదుపుతప్పడంతో శేఖర్ కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో సద్గుణ శేఖర్ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం

మన్సూరాబాద్ : కడుపు నొప్పితో తమ పానీపూరి దుకాణం నుంచి ఇంటికని వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. నాగోల్‌లోని జైపురికాలనీలో పానీపూరీ సెంటర్ నిర్వహిస్తున్న వాకా నాగబాబు, తన భార్య, కుమారుడు, కుమార్తెతో కలిసి ఉంటున్నాడు. కాగా చైతన్యపురిలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న అతడి కుమార్తె వాకా మీనాక్షి(16)శుక్రవారం కళాశాలకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చింది. అనంతరం తల్లిదండ్రులు నిర్వహించే పానీపూరీ దుకాణం వద్దకు వచ్చిన మీనాక్షి తనకు కడుపునొప్పి రావడంతో ఇంటికి వెళ్లింది. ఈ క్రమంలో కొద్దిసేపటి తర్వాత ఇంటి వద్ద ఉన్న మీనాక్షి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు ఇంటికి ఫోన్ చేయగా ఎంతకీ స్పందించలేదు. తల్లిదండ్రులు ఇంటికి వెళ్లి చూడగా కుమార్తె కనిపించకపోవడంతో చుట్టుపక్కల, తెలిసిన వారిని వాకబు చేసినా ఆచూకీ లభించలేదు. నాగబాబు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అభాగ్యుడిని చేరదీసిన 'మాతృ దేవోభవ'

సరూర్‌నగర్ : మాసిన గడ్డం, చిరిగిన దుస్తులతో రోడ్డుపై తిరుగుతున్న మతిస్థిమితం లేని ఓ అభాగ్యుడికి బాలాపూర్ మండలం నాదర్‌గుల్‌లోని మాతృదేవోభవ అనాథాశ్రమం ఆశ్రయం కల్పించింది. తనది తమిళనాడు అని, తన పేరు మురుగదాస్ అని మాత్రమే చెబుతున్న ఓ వ్యక్తి వారం రోజులుగా బొంగుళూరు చౌరస్తా, ఓఆర్ఆర్ ఎగ్జిట్-12 పరిసరాల్లో పిచ్చోడిలా తిరుగుతున్నాడు. స్థానికులు గమనించి మాతృదేవోభవ ఆశ్రమం నిర్వాహకుడు గట్టు గిరికి సమాచారం ఇవ్వగా, ఆయన ఆదిభట్ల ఎస్ఐ వెంకటేశ్ సమక్షంలో అతడిని చేరదీసి తన ఆశ్రమానికి తరలించారు. అతడిని మామూలు మనిషిగా మార్చి కుటుంబ సభ్యులకు అప్పగించడానికి ప్రయత్నిస్తానని గిరి పేర్కొన్నారు.

పండుగకు వచ్చి వెళ్తుండగా విషాదం

● రోడ్డు ప్రమాదంలో భార్య మృతి.. భర్తకు గాయాలు



నందిని (ఫైల్)

చౌటుప్పల్ రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య మృతిచెందగా, భర్తకు గాయాలయ్యాయి. వలిగొండ క్రాస్ రోడ్డు వద్ద వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని లారీ అతివేగంతో ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామానికి చెందిన కొయ్యడ సత్యనారాయణ భార్య నందిని(40)తో కలిసి హైదరాబాద్‌లోని నాగోల్‌లో నివాసం ఉంటున్నారు. నందిని నాగోల్‌లో బ్యూటీ పార్లర్ నిర్వహిస్తోంది. శుక్రవారం వలిగొండ మండలం గొల్నేపల్లిలో గ్రామ దేవతల పండుగ సందర్భంగా బంధువుల ఇంటికి వెళ్లి ద్విచక్ర వాహనంపై హైదరాబాద్‌కు బయలుదేరారు. చౌటుప్పల్‌లోని వలిగొండ క్రాస్ రోడ్డు వద్ద వీరిద్దరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కంటెయినర్ లారీ అతివేగంతో ఢీకొట్టింది. ఈ ఘటనలో భార్య నందినిపైకి లారీ ఎక్కడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. భర్త సత్యనారాయణకు గాయలయ్యాయి. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు కాగా, హైదరాబాద్‌లో చదువుతున్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

వనస్థలిపురం : వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలో విధులు నిర్వహించే కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నర్సింహ డిమాండ్ చేశారు. శుక్రవారం వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలో కాంట్రాక్టు కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశానికి నర్సింహ హాజరై మాట్లాడారు. సామిడి శేఖర్‌రెడ్డి, బోయపల్లి రాములుగౌడ్, రమావత్ శక్రునాయక్, వెంకట్, నాగరాజు, కృష్ణ, భాగ్యమ్మ పాల్గొన్నారు.

దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్ల మృతులకు నివాళులు

● ఘటన జరిగి 12ఏళ్లు



బాంబు పేలుళ్ల మృతులకు నివాళులర్పిస్తున్న ఏటీఎఫ్ చైర్మన్ డాక్టర్ రావినూతల శశిధర్, నవీన్, అనంతాచారి, రహీం

దిల్‌సుఖ్‌నగర్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్ల ఘటన చోటుచేసుకుని పుష్కరకాలం గడిచినా.. నేటికీ ఆ ఘటనను నెమరు వేసుకుంటే గుండె బరువెక్కుతుంది. దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్లలో అమాయకులైన 18మంది మృతిచెందగా, 80మంది వరకు గాయాలపాలైన చేదు నిజాన్ని బాధిత కుటుంబాలు నేటికీ జీర్ణించుకోలేకపోతున్నాయి. ఈ దుర్ఘటన జరిగి 12సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బాంబుపేలుడు ఘటనాస్థలి దిల్‌సుఖ్‌నగర్ చౌరస్తా ఏ1 మిర్చి సెంటర్ వద్ద మృతులకు పలువురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పార్టీల నేతలు శుక్రవారం నివాళులర్పించారు. గోకుల్‌ఛాట్ బాంబుపేలుళ్ల బాధితుడు రహీం ఏ1 మిర్చిసెంటర్ వద్దకు వచ్చి బాంబుపేలుళ్ల మృతులకు నివాళులర్పించి, కన్నీటి పర్యంతమయ్యారు.

యాంటి టెర్రరిజమ్ ఫోరమ్ ఆధ్వర్యంలో..

యాంటి టెర్రరిజమ్ ఫోరమ్(ఏటీఎఫ్) ఆధ్వర్యంలో ఘటనా స్థలిలో బాంబు పేలుళ్ల మృతుల చిత్రపటాలు ఏర్పాటు చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏటీఎఫ్ చైర్మన్ డాక్టర్ రావినూతల శశిధర్ మాట్లాడుతూ బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మృతులకు నివాళులర్పించిన వారిలో ఏటీఎఫ్ కన్వీనర్ బ్రహ్మచారి, బీజేవైఎం సీనియర్ నేత గగనమ్ నవీన్‌కుమార్, వీహెచ్‌పీ కార్యదర్శి కీర్తిగారి అనంతాచారి, ఏటీఎఫ్ ప్రతినిధులు మనోజ్, మహేష్, సుధీర్, రాజేందర్, రాజు, శ్రీశైలం, పాండు, బద్రీనాథ్, అనిల్ పాల్గొన్నారు.







